క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

అనపర్తి: మండలంలోని మూడు గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం తెలిపారు. మండలంలోని కుతుకులూరు, మహేంద్రవాడ, అనపర్తి గ్రామాల పరిధిలో మొత్తం 5 పోస్టులు ఖాళీలున్నాయని రిజర్వేషన్ ప్రాతిపదికన వాటిని భర్తీ చేస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓకు ప్రశంసా పత్రం



కలెక్టర్ మాధవీలత నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న యేసయ్య

రంగంపేట: మండలంలోని బాలవరం, జి.దొంతమూరు గ్రామాలకు వీఆర్‌ఓగా పనిచేస్తున్న బత్తిన యేసయ్య ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికయ్యారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాధవీలత ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికైన యేసయ్యకు ప్రశంసాపత్రం అందించారు. అనపర్తి నియోజకవర్గం 228 పోలీంగ్ కేంద్రాల్లో అందరికంటే ఎక్కువగా ఓటు ఆధార్ లింక్, కొత్త ఓట్లు నమోదు, డెత్ ఓట్ల తొలగింపులో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ గౌరవం దక్కింది. యేసయ్యను తహసీల్దార్ అమ్మాజీ, డిప్యూటీ తహసీల్దార్ దొరకయ్య, మండల వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు అభినందించారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వరరావు తదితరులు

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. మండలంలోని గుమ్ములూరు, మధురపూడి, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, కోటి, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం గ్రామాల్లోని హైస్కూళ్లలో 450 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గుమ్ములూరు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరాహస్వామికి కలశ పూజ



వరాహస్వామికి కలశ పూజ చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వరాహస్వామికి బుధవారం కలశ పూజ నిర్వహించారు. స్వామికి క్షీరాధివాసం, జలాధివాసం, నీరాజన మంత్ర పుష్పాల అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుచేయాలి



రామేశ్వరంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న అమ్మాజీ

పెదపూడి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు సక్రమంగా అమలు చేయాలని కాకినాడ డీఎల్‌పీఓ వై.అమ్మాజీ అన్నారు. రామేశ్వరం గ్రామ సచివాలయంలో మండలంలోని సచివాలయం కార్యదర్శులకు సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్నులు, స్వామిత్వ సర్వే, స్పందన, చెత్త నుంచి తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్ట్ అంశాలపై గ్రామాల వారీగా సమీక్ష చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, సర్పంచ్ కొటికలపూడి చినబాబు పాల్గొన్నారు.

కొప్పవరం.. ప్రగతి పథం..

- నలుదిశలా పూర్తిస్థాయిలో తారురోడ్లు
- పచ్చదనం, పన్నుల వసూళ్లలో ఆదర్శం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మారిన గ్రామ ముఖచిత్రం



కొప్పవరం గ్రామం



కొప్పవరం-లక్ష్మీనరసాపురం రహదారికి ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచుతున్న కొబ్బరి, మామిడి మొక్కలు

అనపర్తి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామం కొప్పవరం. అయినా దశాబ్దాల తరబడి అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండిపోయింది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో గ్రామానికి మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయరెడ్డి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఆయన సహకారంతో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. దీంతో కొప్పవరం సరికొత్త ప్రగతి పథంలో పయనిస్తూ అభివృద్ధికి చిరునామాగా మారింది.

కొప్పవరానికి రాచమార్గాలు

వేమగిరి-సామర్లకోట, సోమేశ్వరం-రాజానగరం, పెడపర్తి-రాజానగరం వంటి ప్రధాన రహదారులు కొప్పవరం గ్రామానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. గ్రామస్తులు ఈ రహదారులను చేరితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడికైనా సులభంగా ప్రయాణించొచ్చు. అయితే కొప్పవరం నుంచి ఆ రహదారులను కలిపే లింకు రోడ్లు ఏళ్ల క్రితమే అధ్వాన స్థితికి చేరుకోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు తప్పేవి కావు.

గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాయకత్వంలో కొప్పవరం గ్రామస్తులు మా రహదారులను అభివృద్ధి పరచండి మహాప్రభో అంటూ కొప్పవరం నుంచి అనపర్తి వరకు పాదయాత్రను చేపట్టారు. అయినా అప్పటి ప్రభుత్వం తన మొద్దు నిద్రను వదల్లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొప్పవరం నుంచి అనపర్తి, లక్ష్మీనరసాపురం, కొమరిపాలెం, పొలమూరు, మహేంద్రవాడ గ్రామాలకు పూర్తిస్థాయిలో తారురోడ్లు వేశారు. దీంతో ఒకప్పుడు కొప్పవరం గ్రామానికి రావాలంటే అయ్య.. బాబోయ్! అన్నవారే ప్రస్తుతం ఇక్కడి రహదారులు చూసి వహ్వా అంటున్నారు. నేడు కొప్పవరం గ్రామస్తులే కాక అనపర్తి, కొమరిపాలెం, మహేంద్రవాడ, తొస్సిపూడి, పందలపాక, రాయవరం తదితర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కొప్పవరం మీదుగానే ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఆర్థిక సంఘం నిధులే ఆలంబనగా..

కేవలం గ్రామం నుంచి పొరుగు గ్రామాలను కలిపే రహదారులను అభివృద్ధి చేయడంతోనే కొప్పవరం గ్రామ పురోగతి ఆగలేదు. గ్రామ సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయితీ 14, 15వ ఆర్థిక సంఘం నిధులు లక్షలాది రూపాయలతో గ్రామంలోని అంతర్గత రహదారులు, చిన్న డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం పూర్తయింది. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఉపాధి హామీ నిధులతో కల్వర్టును నిర్మించడంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు తెరదించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు విడదల చేయడంతో గ్రామంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపించారు. సుమారు రూ.1 కోటి వ్యయంతో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. వరుసగా రెండు సంవత్సరాలు కేవలం రోజుల వ్యవధిలోనే నూరు శాతం ఇంటి పన్నులు వసూలైన గ్రామం కొప్పవరం కావడం విశేషం.

ఎటుచూసినా పచ్చదనం.. ఆహ్లాదం

సాధారణంగా గ్రామ పొలిమేరల్లో ముందుగా కనిపించేవి చెత్తకుప్పలే. అయితే కొప్పవరం గ్రామం మాత్రం దీనికి భిన్నం. రహదారి పొడవునా పచ్చని మొక్కలే దర్శనమిస్తాయి. రోడ్లకు ఇరువైపులా నాటిన కొబ్బరి, మామిడి వంటి పండ్ల మొక్కలు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచితే, పంచాయతీకి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటంగా నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు చాలా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. కొప్పవరంలో మాత్రం సర్పంచ్ చొరవతో ఈ కేంద్రంలో వర్మీ కంపోస్ట్ తయారవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎంపిక చేసిన మోడల్ విలేజ్‌ల్లో కొప్పవరం ఒకటి కావడం గమనార్హం.

ఒకటే మాట... అదే అభివృద్ధికి రాచబాట



గ్రామాభివృద్ధి కోసం ప్రతి విషయంలోనూ గ్రామస్తులందరిదీ ఒకే మాట.. ఒకే బాటగా ముందుకు సాగుతుండడంతో గ్రామంలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతోంది. గత మూడున్నరేళ్లుగా కొప్పవరం అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎనలేని సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాబోయే మూడేళ్లలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తాను.

– కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, సర్పంచ్, కొప్పవరం



వినియోగంలోకి వచ్చిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన అనపర్తి- కొప్పవరం రోడ్డు

ఓటుహక్కు వజ్రాయుధం

రాజానగరం: ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయుధం లాంటిదని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మండల రెవెన్యూ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటును కరెన్సీ నోటుకు అమ్ముకోరాదన్నారు.

అనంతరం సీనియర్, జూనియర్, దివ్యాంగుల ఓటర్లలలో ఒక్కొక్కరిని ఎంపిక చేసి సత్కరించారు. ఎంపీడీఓ బి.రామారావు, తహసీల్దార్ పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తేనే ప్రజాస్వామ్యం విరాజిల్లుతుందని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అన్నారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్, డి.కవిత, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్‌మీరా పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో ఓటుహక్కుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుతో మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. మండలంలోని వివిధ సచివాలయాలు, పాఠశాలల వద్ద ఓటర్ల దినోత్సవం జరిగింది.

ఓటు నమోదు అందరి బాధ్యత

అనపర్తి: ప్రజాస్వామ్య వ్యవస్థలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక శ్రీతేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి ఓటు మార్గదర్శి అని, ఓటు నమోదుతో పాటు దానిని సక్రమంగా వినియోగించినపుడే ఆ హక్కుకు విలువ ఉంటుందన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలుపుతూ విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ టి.శశిధర్, సర్పంచ్ వారా కుమారి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బిక్కవోలు: 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకుని పరిపాలనా వ్యవస్థలో భాగస్వాములు కావాలని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం బిక్కవోలు పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఇచ్చే తీర్పుపైనే అభివృద్ధి, సంక్షేమం ఆధారపడి ఉంటాయన్నారు.

అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ళ సుమలత, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గైట్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



బొల్లెద్దుపాలెం పాఠశాల వద్ద ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం



అనపర్తిలో ఓటు హక్కు విలువను తెలుపుతూ వేసిన ముగ్గులు



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

ఉప్పొంగిన దేశభక్తి



గుప్పెటపై భారత దేశ చిత్రపటం

రాజానగరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరంలో నివాసం ఉంటున్న ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి పెంకే కృష్ణస్వామి గీసిన చిత్రాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. కుల, మతాలకు అతీతంగా అంతా ఐక్యతతో ఉంటేనే ఏవిధంగా ఉంటుందో తెలియజేస్తూ గుప్పెటపై భారతదేశ చిత్రపటాన్ని చిత్రీకరించి, అధ్యాపకులు, సహ విద్యార్థుల నుంచి అభినందనలు అందుకున్నాడు. అలాగే పెన్సిల్ మొనపై జాతీయ పతాకాన్ని చెక్కి తన జాతీయ భావాన్ని వ్యక్తపరిచాడు.



పెన్సిల్ మొనపై జాతీయ జెండా

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే



రఘుదేవపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ మూడున్నరేళ్లలో నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం రఘుదేవపురంలో వివిధ పార్టీలకు చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన గేదెల కుమార్, చొదరి సుబ్బారావు, నాతి రాము ఆధ్వర్యంలో తలబల లోవరాజు, కోరుమిల్లి శ్రీను, తోట వీరబాబు, తోట కృష్ణలతో పాటు 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు యువత ఆకర్షితులవుతున్నారని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీలో తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, దాసరి బాబి, యలమాటి కాశీ, పిండి రాధాకృష్ణ, పైడి రాజు, పంతుల శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలాఉంటే మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల పలు కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కాటవరంలో పార్టీ కోకన్వీనర్ తండ్రి పట్టాభి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాపాకలో పిచ్చుకుల రవికుమార్ తండ్రి ప్రథమ సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. వంగలపూడిలో పలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చినకొండేపూడిలో అడ్వకేట్ క్రొవ్విడి కృష్ణమూర్తి ఇటీవల బైపాస్ సర్జరీ చేసుకోగా అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు, పార్టీలో చేరికల కమిటీ చైర్మన్ గద్దె వెంకటకృష్ణచౌదరి (నల్లి), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చీపురపల్లిలో గడప గడపకూ..



చీపురపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని, వైఎస్సార్ సీపీని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. బుధవారం చీపురపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరిస్తూనే ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. పార్టీలకతీతంగా పథకాలు అమలు చేస్తున్నామని, నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ పథకాలు చేరవయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, నియోజకవర్గ బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ గోపిశెట్టి అనురాధ, ఎంపీటీసీ బెడిసి లక్ష్మి, ఉప సర్పంచ్ అనిమిల్లి బుజ్జి, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గోపిశెట్టి తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్



కోటపాడులో డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

రంగంపేట: ఉద్యానవన తోటల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు అవసరమైన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉద్యానవన శాఖ ఓఎస్‌డీ జనరల్ రమేష్ సూచించారు. బుధవారం మండలంలోని కోటపాడు, మర్రిపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రాయితీపై రైతులకు అందించిన బిందు సేద్య పరికరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రిప్ వాడే విధానాన్ని, ఉపయోగాల్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన డీఎంఐఓ ఎస్.మోహనరావు, ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ,, ఎంఐఈ రాంబాబు, వీహెచ్‌ఏ వీక్షణి, డీసీఓ రాజు, రైతులు పాల్గొన్నారు.

గడప గడపకూ.. విజయవంతం చేయాలి

బిక్కవోలు: పందలపాకలో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పందలపాకలో వలంటీర్లు, సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీన పందలపాకలో జరిగే గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, ఎంపీటీసీ మచ్చాపాప తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పెదపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ మండల కన్వీనర్ వెంకటరెడ్డి అన్నారు. జి.మామిడాడలో నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లకు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్లు సైనికుల్లా పనిచేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు

రుణ విముక్తి పత్రాల అందజేత

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో గతంలో ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలను ఓటీఎస్(వన్ టైం సెటిల్‌మెంట్) పథకం ద్వారా చెల్లించిన 62 మంది లబ్ధిదారులకు సర్పంచ్ బుంగా రామారావు రుణవిముక్తి పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రకాశంనగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 23, 24 తేదీల్లో కాకినాడ ఐడియల్ కళాశాలలో జరిగిన మహిళల హ్యాండ్‌బాల్ పోటీలలో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.